కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాల నుంచి టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు స్థానికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడే నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఎత్తైన ప్రాంతాలలో ఉన్న ఇళ్ల వారికి తాగునీరు అందడం లేదన్న విషయం వాస్తవమేనని ఆయన అన్నారు. త్వరలోనే తాను నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటానన్నారు. టోలిచౌకీ, గోల్కొండ, లంగర్ హౌస్ తదితర ప్రాంతాల్లో వరద నీటి పైపులైన్ల నిర్మాణం జరుగుతుందని దీన్ని వల్ల ఆ ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని ఆయన అన్నారు. పైప్‌లైన్ వేయడం పూర్తయిన ప్రాంతాల్లో వెంట వెంటనే ఆ ప్రాంతంలో సీసీ రోడ్లు వేయడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్ తదితరులున్నారు.

అమ్మవార్లకు సేవ చేయడం అదృష్టం

గోల్కొండ: గోల్కొండ ఎల్లమ్మ తల్లి వారికి సేవ చేయడం తన అదృష్టమని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. మంగళవారం ఆయనను రిసాలబజార్‌లోని శివాలయంలో సన్మానించారు. సాయిబాబాచారి మాట్లాడుతూ.. అమ్మవారికి సేవ చేసే వృత్తిపని వారి హక్కుల పరిరక్షణ కోసం 14 ఏళ్లుగా కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్, శ్రీను తదితరులున్నారు.



సాయిబాబాచారిని సన్మానిస్తున్న దృశ్యం

కాంగ్రెస్‌తోనే మున్సిపల్ కార్మికులకు న్యాయం



సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

చాంద్రాయణగుట్ట: పూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా ఉన్న మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ సమావేశం కొనసాగింది. సీఎం రేవంత్ రెడ్డి మున్సిపల్ ఉద్యోగులకు అన్ని రకాలుగా అండగా ఉంటారని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్, విజయ్ కుమార్ యాదవ్, జి.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, శివ కుమార్, కె.రమేష్, గాంధీ, రాజు, వెంకటేష్, కరీముల్లా, హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు
రౌండ్ ది క్లాక్ సేవలు



వెంకటేశ్వరరావు
ఏసీపీ మీర్‌చౌక్

చార్మినార్: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం విధినిర్వహణ కొనసాగిస్తున్నారని..ఇందుకు ఆయా ప్రాంతాల్లోని స్థానిక ప్రజలు సైతం సహకరిస్తున్నారని మీర్‌చౌక్ డివిజన్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ (ఏసీపీ) ఎస్ఎస్‌వీ వెంకటేశ్వర రావు అన్నారు. పాతబస్తీ దక్షిణ మండలంలోని మీర్‌చౌక్ డివిజన్‌లోని ప్రజలకు రౌండ్ ది క్లాక్ సేవలను అందజేస్తూనే..రౌడీ షీటర్లపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. మీర్‌చౌక్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు.

మీ డివిజన్ పరిధిలో ఎన్ని పోలీస్ స్టేషన్లున్నాయి..?

◆ మీర్‌చౌక్, రైయిన్‌బజార్, భవానీనగర్ పోలీస్ స్టేషన్లున్నాయి.

శాంతి భద్రతల విషయంలో తీసుకుంటున్న చర్యలేమిటి..?

◆ ఇప్పటికే నమోదైన రౌడీషీటర్లపై గట్టి నిఘా కొనసాగిస్తున్నాం. సంఘవిద్రోహ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ తమకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్థానికులను కోరుతున్నాం.

ప్రస్తుతం పాతబస్తీ పోలీసు స్టేషన్లలో ఏవైనా మార్పులున్నాయా..?

◆ పోలీసు శాఖలోని సిబ్బందికి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. పాత పోలీసు భవనాల స్థానంలో అధునాతనమైన పోలీసు భవనాలు అందుబాటులోకి వచ్చాయి. శాఖా పరంగా ఎంతో అభివృద్ధి జరిగింది.

ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు..?

◆ అన్ని వర్గాల ప్రజలు శాంతి భద్రతలను కాపాడడంలో ముందుండాలి. ఏ ఉత్సవాలైనా ఆనందోత్సాహాలతో సమష్టిగా నిర్వహించుకోవాలి. ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగే విధంగా వ్యవరిస్తే.. కఠినంగా వ్యవహరిస్తాం. శాంతి భద్రతల పరిరక్షణలో స్థానికులు తమతో పూర్తిగా సహకరించాలి.

మీరు గతంలో పని చేసిన విశేషాలు ఏవైనా..

◆ ప్రస్తుతం నేను గత ఏడాది నుంచి మీర్‌చౌక్ ఏసీపీగా విధినిర్వహణ కొనసాగిస్తున్నా. అంతకు ముందు 2011 నుంచి 2014 వరకు హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో పని చేశా. 2017లో ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి డీఎస్పీగా పదోన్నతి పొంది సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని పీసీఎస్‌లో పని చేశా. 2019 నుంచి ఆదిలాబాద్‌లో లా అండ్ ఆర్డర్ డీఎస్పీగా.. 2022 నుంచి రామగుండం సీసీఎస్‌లో డీఎస్పీగా చేసిన నేను గత ఏడాది నుంచి మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీగా పని చేస్తున్నా.

కవి సీతారాంకు దేవులపల్లి రామానుజరావు పురస్కారం



సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత పరిషత్తు ఏటా ప్రదానం చేసే డాక్టర్ దేవులపల్లి రామానుజరావు పురస్కారానికి ఈ సారి ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఆర్.సీతారాం ఎంపికయ్యారు. 'ఇదిగో ఇక్కడిదాకే'సన్నాఫ్ మాణిక్యం, కుప్పం కవిత వంటి కవితా సంపుటాలు, 'అదేపుట'మొదలైన విమర్శ వ్యాస సంపుటాలు, పరిశోధన గ్రంథాలు వెలువరించారు. ప్రస్తుతం ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి గతంలో కాళోజీ పురస్కారం అందుకున్నారు. ఈనెల 24న దేవులపల్లి రామానుజరావు 107వ జయంతి సందర్భంగా పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సభలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ముఖ్య అతిథిగా పాల్గొని సీతారాంను రూ.25 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తారని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



చాంద్రాయణగుట్ట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఫలక్‌నుమాలోని నారాయణ పాఠశాలలో మంగళవారం నూతన విద్యార్థి మండలి క్యాబినేట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు ఆటా పాటలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన హెడ్ బాయి, హెడ్ గర్ల్ బ్యాడ్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రవీందర్ బాబు, ఏడీ సాయిబాబు, ప్రిన్సిపాల్ నౌషిన్ ఫాతీమా, ఏవో రాజు, కో ఆర్డినేటర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'తెరవెనుక' పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సరసిజ థియేటర్ ఆధ్వర్యంలో రచయిత్రి డాక్టర్ సమ్మెట విజయ రచించిన 'తెర వెనుక'పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి సి.పార్థసారథి మాట్లాడుతూ.. మహిళా రచయిత్రులు సాహిత్య రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, రంగస్థల నటుడు ఆర్.కోటేశ్వరరావు, నటుడు వెంకట్, సరసిజ వ్యవస్థాపకురాలు అత్తలూరి విజయలక్ష్మీ, రచయిత్రి సమ్మెట ఉమాదేవి, లేఖిని రచయిత్రుల వేదిక కార్యదర్శి సరస్వతి పాల్గొన్నారు.

బంగారం వ్యాపారం అన్నాడు..
రూ.35.09 లక్షలతో ఉడాయించాడు

గౌలిపురా: బంగారం వ్యాపారం పేరుతో ఓ వ్యక్తి 35.09 లక్షలతో ఉడాయించిన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ వివరాల ప్రకారం.. గౌలిపురా శిశు మందిర్ పాఠశాల ప్రాంతానికి చెందిన విశాల్ ప్రసాద్ (41) బంగారం వ్యాపారం నిర్వహిస్తున్నాడు. దీంతో పాటు అలేఖ్య రెడ్డి జువెల్లరీ పేరుతో లాలాపేట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అలియాబాద్ ప్రాంతానికి చెందిన ప్రొసెంజిత్ పాల్ గోల్డ్‌స్మిత్ వర్క్‌షాపు నిర్వహిస్తానని.. నో మేకింగ్, నో వెస్టేజ్, నో స్టోన్ చార్జ్ అంటూ పరిచయం చేసుకొని రూ.15 లక్షలు, రూ.20 లక్షల ప్రామిసరీ నోట్ చూపించి వ్యాపారం చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో విశాల్ ప్రసాద్, ప్రొసెంజిత్ పాల్‌కు బంగారు ఆభరణాల వ్యాపారాన్ని ఇచ్చాడు. ప్రొసెంజిత్ పాల్ పలుమార్లు బంగారు ఆభరణాల డెలివరీ చేశాడు. ఈ క్రమంలో విశాల్ ప్రసాద్ ప్రొసెంజిత్ పాల్‌కు 19 సార్లు విడతల వారీగా రూ.35.09 లక్షలు చెల్లించారు. చివరిగా గత నెల 4వ తేదీన ఆభరణాలు డెలివరీ ఎప్పుడు చేస్తావని అడగగా.. జూలై 25వ లోపు చేస్తానని చెప్పాడు.ఆ తర్వాతత ప్రొసెంజిత్ పాల్ అందుబాటులో లేకపోవడంతో పాటు ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. వెస్ట్ బెంగాల్ కలకత్తాలోని ఇంటి వద్ద ఆరా తీయగా అక్కడి నుంచి ఇంటిని మార్చినట్లు తెలిసింది. మోసపోయినట్లు గ్రహించిన విశాల్ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శంకర్

సుల్తాన్‌బజార్: మాల్స్, ఇతర వ్యాపార కేంద్రాల వద్ద దృష్టి మళ్లించి పిక్ ప్యాకెటింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సుల్తాన్ బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బి.బాలస్వామి, అడిషనల్ డీసీపీ జె.నరసయ్య, సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాయిఘడ్‌కు చెందిన షభానా(22), కుంతీబాయి(32), రిహానా (35), రెనోబాయి (35), మందాకిని పిసోడియా(35) ఓ ముఠాగా ఏర్పడి ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌కు చేరుకొని సికింద్రాబాద్‌లోని సితారా హోటల్‌లో మకాం వేసింది. ఒక ఆటోను రోజువారి అద్దెకు మాట్లాడుకుని రద్దీ ప్రాంతాలే టార్గెట్‌గా జేబు దొంగతనాలతో పాటు నకిలీ బంగారాన్ని పెట్టి ఒరిజినల్ బంగారాన్ని దృష్టి మళ్లించి తస్కరించేవారు. ఈ క్రమంలో సుల్తాన్ బజార్‌లోని ఓ బట్టల దుకాణంలో యూఎస్‌లో ఉంటున్న ఓ మహిళ పర్సును దొంగిలించారు. అందులో రూ.16 వేలతో పాటు గ్రీన్ కార్డు డీఎల్ క్రెడిట్ కార్డులు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అఫ్జల్‌గంజ్ మధుకుమార్, ఎస్ఐ నరేష్, క్రైమ్ సిబ్బంది ఆధ్వర్యంలో కోఠి నుంచి సికింద్రాబాద్ వరకు సీసీ కెమెరాలను పరిశీలించారు. అందులో ఆటోలో నిందితులు ప్రయాణించినట్లు తెలుసుకొని ఆటో నెంబర్ ఆధారంగా వారిని పట్టుకొని దర్యాప్తు ప్రారంభించారు. వారు బట్టల వ్యాపారులు, జ్యువెలరీ షాపులు టార్గెట్‌గా తమ చేతివాటం ప్రదర్శించేవారని తేలింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ.2000, 35 చీరలు, బంగారం గోల్డ్ కోటెడ్ కలిగిన గాజులు, పుస్తెల తాడు, చెవిపోగులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐదుగురు ముఠా సభ్యులను రిమాండ్‌కు తరలించారు.

నేడు జియాగూడలో ఆరోగ్య శిబిరం

జియాగూడ: ఈ నెల 14న హిందూ రాష్ట్ర సేన జియాగూడ భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హిందూ రాష్ట్ర సేన ప్రతినిధులు ఆదిత్య, శక్తి సింగ్, వివేక్ జవాలే తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు, మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు.

నేడు ఎగ్జిబిషన్‌లో శ్రీనివాస కల్యాణం



అబిడ్స్: టీటీడీ, ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న శ్రీనివాస కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్తెందర్, కార్యదర్శి హన్మంతరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కల్యాణ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. మంత్రి డి.శ్రీధర్‌బాబు హాజరై కల్యాణ వేడుకలు ప్రారంభిస్తారని వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

యాకుత్‌పురా: బస్తీల్లో సమస్యల పరిష్కారానికి అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. తలాబ్‌చంచలం డివిజన్‌లోని ఆమన్‌నగర్-బీ, నషేమాన్ నగర్, చాచాగ్యారేజ్, సిద్దిఖీ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన కార్పొరేటర్ సమీనాబేగం, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలాబ్‌చంచలంలోని పలు ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, సమీనా బేగం

షాహీన్‌నగర్‌లో హెచ్‌హెచ్‌ఎఫ్ ఆసుపత్రి ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, అమెరికాలోని ఏఎంపీఐ సహకారంతో షాహీన్ నగర్‌లోని మసీదులో ఏఎంపీఐ-హెచ్‌హెచ్‌ఎఫ్ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఇటీవల ట్రాపికల్, ఇన్ఫెక్షియస్ డిసీజ్ సెంటర్‌ను బోర్డ్ ఆఫ్ ఏఎంపీఐ యూఎస్ఏ కార్యదర్శి డాక్టర్ జైనాబ్ బేగ్ లాంఛనంగా ప్రారంభించారు. యూఎస్ఏలోని కార్నెల్ యూనివర్సిటీ ఎన్వై నుంచి ఉన్నత ఇంటర్నల్ మెడికల్ కన్సల్టెంట్, ఉస్మానియా మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, మసీదు అధ్యక్షుడు, జమియత్ అహ్లే హదీస్ సభ్యుడు జనాబ్ హబీబ్ అక్బీల్ సమక్షంలో ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఏఎంపీఐ లక్ష డాలర్లను విరాళంగా అందించింది. ఈ మేరకు మంగళవారం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధి ముజ్తబా హసన్ అస్కారీ ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు.

తల్లిదండ్రులకు రుణపడి ఉండాలి



పురస్కారాన్ని అందజేస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తల్లిదండ్రులకు జీవితాంతం రుణపడి ఉండాలని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భీమన్న సాహితీ నిధి, కళానిలయంల ఆధ్వర్యంలో రచయిత్రి హైమావతి భీమన్న జన్మదినం సందర్భంగా రచయిత్రి ఆలూరి విజయలక్ష్మికి కొత్తూరు వెంకటలక్ష్మి, సుబ్బయ్య దీక్షితుల పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తల్లిదండ్రులు కనుమరుగైనా వారి పేరిట చేసే సత్కారాలు సమాజంలో శాశ్వతంగా నిలిచి ఉంటాయని తెలిపారు. అంతకు ముందు నృత్య గురువు యాదగిరి ఆచార్య శిష్య బృందం నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళానిలయం వ్యవస్థాపక కార్యదర్శి ఎ.సురేందర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బోనాలు



పూజలు చేస్తున్న దళితరత్న అవార్డు గ్రహీత మాణిక్‌రావు

అబిడ్స్: మత సామరస్యానికి ప్రతీకగా బోనాల వేడుకలు నిలుస్తాయని దళితరత్న అవార్డు గ్రహీత, గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాణిక్‌రావు పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలతో ప్రజల్లో భక్తి భావాలు పెరుగుతాయన్నారు. శాసనసభ సచివాలయ బంగారు మైసమ్మ ఆలయంలో జరిగిన బోనాల వేడుకల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల పండుగలను స్వయంగా చేపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటే విధంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



బహదూర్‌పురా: బహదూర్‌పురా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వివిధ రకాల హారన్ శబ్దాలు చేసే వాహనాలు, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్‌లపై ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై కేసులు నమోదు చేసి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా వివిధ శబ్దాలను చేసే వివిధ రకాల హారన్లు పెట్టుకోవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక చవితికి అన్ని ఏర్పాట్లు చేయాలి



అబిడ్స్: వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి జీహెచ్ఎంసీ అబిడ్స్ 14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన వినతి పత్రం అందజేశారు.

క్రీడాలో ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులపై సమీక్ష



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఆర్-క్రీడా)లో ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులపై రెండు రోజుల సమీక్షా సమావేశం మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా న్యూ ఢిల్లీకి చెందిన ఐసీఏఆర్ (ఎన్ఆర్ఎం) డీడీజీ చైర్మన్ డాక్టర్ ఎస్.కె.చౌదరి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్ స్వాగతం పలికి సమావేశం ఉద్దేశ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.కె.చౌదరి మాట్లాడుతూ..ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుల సమీక్షా సమావేశాన్ని సంవత్సరానికి రెండుసార్లు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో క్లోజ్డ్ ప్రాజెక్టులు, కొత్త ప్రాజెక్టులు, కొనసాగుతున్న ప్రాజెక్టులపై చర్చించారు. ఈ సమావేశానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 30 మంది పాల్గొని ప్రాజెక్టుల పురోగతిని వివరించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి జైలు శిక్ష

గౌలిపురా: చోరీకి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష పడింది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా చాచా గ్యారేజీ ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ (35) భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల దొంగతనం చేసేందుకు అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని మంగళవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వపరాలను పరిశీలించిన స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

గంజాయి సేవిస్తున్న వ్యక్తి..

గంజాయి సేవిస్తున్న కేసులో ఓ వ్యక్తికి ఏడు రోజులు జైలు శిక్ష పడింది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా రోడ్డు నంబర్-11 ప్రాంతానికి చెందిన మహ్మద్ ఐజాజ్ (20) స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్నాడు. పోలీసులు ఐజాజ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

పురానాపూల్‌లో అగ్నిప్రమాదం

బహదూర్‌పురా: పురానాపూల్‌లోని స్వస్తిక్ టెంట్ డెకరేషన్ షాపులో మంగళవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శుభకార్యాలకు వినియోగించే డెకరేషన్ మెటీరియల్ పెద్ద ఎత్తున ఉండడంతో మంటలు ఒక్కసారిగా పైకి ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న కామటిపురా పోలీసులు వెంటనే ఫైర్ ఇంజన్‌తో ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. రాజేష్ కుమార్ కొంతకాలంగా సాత్విక్ డెకరేషన్ మెటీరియల్ షాపు నిర్వహిస్తున్నాడు. అగ్నిప్రమాదంపై కామటిపురా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ సారైనా నామినేటెడ్ దక్కేనా?

- మైనార్టీలకు దక్కకపోవడంతో ఆగ్రహ జ్వాలలు
- నిరసనలకు దిగేందుకు ప్రయత్నాలు?

అబిడ్స్: నగరంలోనే కాక పాతబస్తీలో మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు దక్కకపోవడంతో పెద్ద ఎత్తున నిరసనకు దిగేందుకు యత్నాలు చేస్తున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ నగరంతో పాటు పాతబస్తీకి చెందిన మైనార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆందోళనలు, నిరసనలు చేశారు. గత నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పదవుల్లో పాతబస్తీ దక్కకపోవడంతో పలువురు నాయకులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి మైనార్టీలు కంచుకోటగా ఉన్నారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని అంటుకొని కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న మైనార్టీ నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు.

కార్వాన్, నాంపల్లికి..?

కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్నా కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల మైనార్టీ నాయకులకు ఈ దఫా అయినా పదవులు దక్కుతాయా అని వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిల్లో ఉన్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ పదవులను మైనార్టీలకు ఇవ్వాలని పలువురు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల్లో పార్టీని అంటిపెట్టుకొని గత అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎత్తున ఓట్లు రావడంలో కీలక పాత్ర పోషించిన మైనార్టీ నాయకులకు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సీనియర్లుగా ఉంటూ క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులకు పదవులు ఇవ్వాలని కోరుతున్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీని కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలకు చెందిన స్థానిక మైనార్టీ నాయకులకు ఇవ్వాలని పలువురు పేర్కొంటున్నారు.

ఆందోళన చెందుతున్న మైనార్టీ నాయకులు..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందంటే తమకు పండగ అనుకుంటున్న మైనార్టీ నాయకులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇంకా సరైన నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడంతో పెద్ద ఎత్తున నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కొంతమంది మైనార్టీ నాయకులు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలిసి మైనార్టీలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని మొరపెట్టుకున్నట్లు సమాచారం. మైనార్టీలకు రేపో మాపో ప్రకటించే జాబితాలో పదవులు ఇవ్వాలని మైనార్టీ నాయకులు పలువురు వాపోతున్నారు. గాంధీభవన్‌ను 30 ఏళ్లుగా అంటిపెట్టుకున్న మైనార్టీలకు న్యాయం చేయాలని వారు పేర్కొంటున్నారు.



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గోల్కొండ కోట ముస్తాబైంది. కోట మొత్తం విద్యుత్ దీపాల అలంకరణతో జిగేల్‌మంటోంది. త్రివర్ణ పతాకాన్ని ప్రతిబింబించేలా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు దేదీప్యమానంగా వెలిగేలా ముస్తాబు చేశారు.